# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- విద్యావంతులైన ఆడపిల్లలు దేశ అభివృద్ధిలో కీలకమైన పాత్ర పోషిస్తారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- మిలాద్-ఉన్-నబి, ఓనం పండుగల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.
- కేంద్రప్రభుత్వం అమలుచేస్తోన్న కార్యక్రమాల ద్వారా షిప్పింగ్ పరిశ్రమ భారీ వృద్ధిని సాధిస్తోందని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ పేర్కొన్నారు.
- మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులం ఈ నెల 9 నుండి 8రోజుల పాటు భారత్ లో పర్యటించనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

==============================

దేశ అభివృద్ధిలో విద్యావంతులైన ఆడపిల్లలు కీలకమైన పాత్ర పోషిస్తారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి ఈరోజు న్యూఢిల్లీలో ఉత్తమ జాతీయ ఉపాధ్యాయ అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ.. బాలికల విద్యకు ప్రతి ఒక్కరూ అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆడపిల్లలకు అత్యుత్తమ విద్యను అందించడమే వారికి ఇచ్చే అమూల్యమైన సహకారమని ఆమె అన్నారు. ఉన్నత విద్యలో బాలికల స్థూల నమోదు నిష్పత్తి ఇటీవలి సంవత్సరాలలో గణనీయంగా పెరగడం పట్ల రాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. విద్య, వ్యక్తులకు సాధికారత కల్పిస్తుందని, పిల్లలు అద్భుతమైన పురోగతిని సాధించడానికి వీలు కల్పిస్తుందని అన్నారు. ఆహారం, దుస్తులు, ఆశ్రయం మాదిరిగానే.. ఒక వ్యక్తి గౌరవం, భద్రతకు విద్య కూడా అవసరమని రాష్ట్రపతి పేర్కొంటూ..

(వాయిస్ బైట్...36 సెకన్లు)

==============================

కేంద్రప్రభుత్వం అమలుచేస్తోన్న పోర్టుల ఆధారిత అభివృద్ధి కార్యక్రమాల ద్వారా షిప్పింగ్ పరిశ్రమ భారీ వృద్ధిని సాధిస్తోందని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. తమిళనాడు టుటికోరిన్‌లోని వి.ఓ.చిదంబరనార్ పోర్టులో గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్లాంట్ తో పాటు పలు అభివృద్ధి ప్రాజెక్టులను కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. తీరప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం తీరప్రాంత సమాజ అభివృద్ధి పథకాన్ని తీసుకువచ్చిందని వివరిస్తూ..

(వాయిస్ బైట్...37 సెకన్లు)

==============================

మిలాద్-ఉన్-నబి, ఓనం పండుగల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ముహమ్మద్ ప్రవక్త తన బోధనల ద్వారా మానవాళికి ఐక్యత, సేవల సందేశాన్ని అందించారని, ఈ పవిత్రదినం సందర్భంగా ఆయన బోధనల నుండి ప్రేరణ పొంది, సోదర భావంతో ప్రజలు ముందుకు సాగాలని రాష్ట్రపతి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అలాగే కేరళ సంస్కృతి, వారసత్వం, సంప్రదాయానికి ఓనం పండుగ ప్రతీక అని ఆమె పేర్కొన్నారు. ఈ పండుగ సాంస్కృతిక, మత విశ్వాసాలకు అతీతంగా ఐక్యత, సహకారం, సామరస్యం ప్రాముఖ్యతను గుర్తుచేస్తుందని తెలిపారు.
మిలాద్-ఉన్-నబి పండుగ సమాజంలో శాంతి, శ్రేయస్సును తీసుకురావాలని  ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆకాంక్షించారు. ముహమ్మద్ ప్రవక్త బోధించిన కరుణ, సేవ, న్యాయం ఎల్లప్పుడూ మార్గనిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. అదేవిధంగా.. ఓనం పండుగ అందరికీ ఆనందం, మంచి ఆరోగ్యం, శ్రేయస్సును కలుగజేయాలని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళ సంప్రదాయాలను, సంస్కృతిని ఓనం తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఈ పండుగ ఐక్యత, ఆశ, సాంస్కృతిక గర్వానికి ప్రతీక అని, సమాజంలో స్నేహాన్ని పెంపొందించడానికి, ప్రకృతితో ప్రతి ఒక్కరి బంధాన్ని బలోపేతం చేయడానికి దోహదపడుతుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పే  సానుకూల మార్గాలకు భారత్ మద్దతిస్తుందని ఐక్యరాజ్యసమితిలోని భారతదేశ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ వివాదంపై చర్చ సందర్భంగా ఐక్యరాజ్యసమితిలో ఆయన మాట్లాడుతూ, యుద్ధం వలన జరిగే పరిణామాలను పరిష్కరించడానికి దౌత్యం ఎంతో ముఖ్యమన్నారు. ఇటీవల ఆ దిశగా జరిగిన పలు ప్రయత్నాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. యుద్ధాన్ని ముగించే ప్రయత్నాలకు మద్దతు ప్రకటిస్తూ.. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. ఈ అంశంపై పుతిన్, జెలెన్స్కీలతో పాటు యూరోపియన్ నేతలతో పలుసార్లు మాట్లాడారని తెలిపారు. ఈ ప్రయత్నాలన్నీ ఫలించి.. కీవ్‌లో తిరిగి శాశ్వత శాంతి నెలకొంటుందని తాము విశ్వసిస్తున్నామని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులం ఈ నెల 9 నుండి 16 వరకు భారత్ లో పర్యటించనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఈరోజు ఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రామ్‌గులం తన పర్యటనలో భాగంగా ఢిల్లీతో పాటు ముంబై, వారణాసి, అయోధ్య, తిరుపతిలను కూడా సందర్శిస్తారని ఆయన వెల్లడించారు. ఆస్ట్రేలియాలో భారతీయులపై జరుగుతున్న నిరసనలపై రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ.. విదేశాల్లో ఉన్న భారతీయుల సంక్షేమం, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అమెరికా, భారతదేశాలు సమగ్రమైన ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయని తెలిపారు. పరస్పర గౌరవం, ఉమ్మడి ప్రయోజనాల ఆధారంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు ముందుకు సాగుతాయని తాను ఆశిస్తున్నానని పేర్కొన్నారు. అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు భారత్ కట్టుబడి ఉందని ఆయన వివరిస్తూ..

(వాయిస్ బైట్...38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల దేశంలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారని.. వేల సంఖ్యలో నిరాశ్రయులయ్యారని రాష్ట్రపతి ద్రౌపది అన్నారు.  వరదల వలన  కొండచరియలు విరిగిపడటంతో అనేక రాష్ట్రాల్లో తీవ్ర విధ్వంసం సంభవించిందని తెలిపారు. ఈ సంవత్సరం ప్రకృతి వైపరీత్యాల గురించి విన్న ప్రతిసారీ తీవ్ర వేదనకు గురయ్యానని రాష్ట్రపతి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితులలో తీవ్రంగా శ్రమిస్తున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు, భద్రతా దళాల స్ఫూర్తిని రాష్ట్రపతి ప్రశంసించారు. బాధితులకు యావత్ దేశం అండగా ఉంటుందని, ఈ సవాలును అధిగమిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్, రాజస్థాన్, కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర, సౌరాష్ట్ర, కచ్, మధ్యప్రదేశ్‌లలో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. అలాగే ఉత్తరాఖండ్, హర్యానా,

చండీగఢ్, ఉప-హిమాలయన్ పశ్చిమ బెంగాల్‌తో సహా పలు ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

==============================

పంజాబ్ వరద నష్టాలపై వివరణాత్మక నివేదికను ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సమర్పించనున్నానని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ చౌహాన్ తెలిపారు. రాష్ట్రంలోని సట్లెజ్, బియాస్, రావి, ఘగ్గర్ నదుల ఒడ్డున ఉన్న కట్టలను అక్రమ మైనింగ్ బలహీనపరిచిందని, దీనివల్ల గ్రామాల్లోకి నీరు చేరిందని సామాజిక మాధ్యమం వేదికగా చౌహాన్ తెలిపారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, మాజీ ముఖ్యమంత్రి ప్రకాష్ సింగ్ బాదల్ హయాంలో వరదల నుండి పంటలను రక్షించడానికి వీటిని బలోపేతం చేశారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి విషాదాల నుండి పంజాబ్‌ను రక్షించడానికి ఇప్పుడు వీటిని మళ్ళీ బలోపేతం చేయడం అవసరమని ఆయన అన్నారు.

==============================

==============================